క్లుప్తంగా

'నవోదయ'ను తుంగతుర్తిలో ఏర్పాటు చేయాలని వినతి

తుంగతుర్తి : జవహర్ నవోదయ పాఠశాలను తుంగతుర్తి మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని సోమవారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబా గ్రీవెన్స్‌డేలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తుంగతుర్తి ప్రాంతంలో పేద విద్యార్థులు ఎంతో మంది ఉన్నారని తెలిపారు. ఆయన తోపాటు నవీన్ ఉన్నారు.

వీబీకే రాజీనామా



విచారణ జరుపుతున్న డీపీఎం

మద్దిరాల : ముకుందాపురం గ్రామానికి చెందిన వీబీకే భర్త ప్రభుత్వ ఉద్యోగి అయినందున ఆమెను వీబీకే విధుల నుంచి తొలగించాలని గతంలో గ్రామస్తులు డీపీఎం ఆంజనేయులుకు ఫిర్యాదు చేశారు. దీంతో డీపీఎం సోమవారం మహిళా సంఘం సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి విచారణ జరిపారు. వీబీకే వాస్తవాన్ని ఒప్పుకొని స్వతహాగా రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

తుంగతుర్తి : మండల పరిధిలోని రావులపల్లి ఎక్స్‌రోడ్ తండా గ్రామపంచాయతీ కార్యదర్శి తమ నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తోందని ఆ తండాకు చెందిన గిరిజనులు సోమవారం తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సిఫారసు చేశారు. ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన వారిలో తండావాసులు రాజా, యాకు, వెంకన్న, బిల్యా తదితరులు ఉన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

మద్దిరాల : డ్రిప్, స్ప్రింక్లర్ యూనిట్ల కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల ఉద్యానవన శాఖ అధికారి ప్రమీత అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. వివరాలకు సెల్ 89777 14169ను సంప్రదించాలని సూచించారు.

అనఘాష్టమి వ్రతం

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని లింగాల గ్రామ శివారులో ఇరువంటి సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీదత్త కుటీర్‌లో సోమవారం అనఘాష్టమి వ్రతం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో దత్తాత్రేయ స్వామిని దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు.

ఇళ్ల సర్వే, మధ్యాహ్న భోజనం పరిశీలన



వెంకెపల్లిలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ సునీత

నూతనకల్ : ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చే విధంగా అధికారులు కృషి చేయాలని ఎంపీడీఓ సునీత అన్నారు. సోమవారం మండల పరిధిలోని వెంకెపల్లి, చిల్పకుంట్ల గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను, వన నర్సరీ కేంద్రాలను, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం రూపొందించిన మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందజేయాలని సూచించారు. హరితహారం లక్ష్యాన్ని నెరవేర్చే విధంగా వన నర్సరీ నిర్వాహకులు మొక్కల పెంపకాన్ని చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు గంగరాజు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు రక్షణ కరువు

- సామగ్రిని ధ్వంసం చేస్తున్న ఆకతాయిలు

ఆత్మకూర్(ఎస్) : ఆత్మకూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో సోమవారం బీరు బాటిళ్లు దర్శనం ఇచ్చాయి. గ్రామానికి చెందిన కొందరు ఆకతాయిలు రాత్రి వేళల్లో మద్యంతో పాఠశాల ఆవరణలో విందులు చేసుకుంటున్నారు. మద్యం మత్తులో తరగతి గది తలుపులను పగులకొట్టడంతోపాటు తాగిన సీసాలను ఆవరణలో పడేశారు. ఆరు నెలల్లో ఇదే పాఠశాలలో మూడుసార్లు ఇలాంటి సంఘటనలు వెలుగు చూశాయని హెచ్‌ఎం శ్రవణ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. పవిత్రమైన విద్యాలయంలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడం విచారకరమని అన్నారు. పాఠశాలలో మద్యం సేవించిన ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ధ్వంసమైన పాఠశాల తలుపులు

విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి



తుంగతుర్తిలో క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే సామేల్



తుంగతుర్తి : గురుకులంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే మందుల సామేల్

తుంగతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందని ఎమ్మెల్యే సామేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. అనంతరం రాష్ట్రస్థాయి సీఎం కప్పుకు ఎంపికైన విద్యార్థులను అభినందించి, రూ.15వేలు ప్రోత్సాహక బహుమతిగా అందజేశారు. అలాగే జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధకిషన్‌రావు సీఎం కప్ క్రీడల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులకు రూ.10వేలు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శేషుకుమార్, ఎంఈఓ బోయిని లింగయ్య, మైనారిటీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఉమారెడ్డి, డీసీబీ డైరెక్టర్ గుడపాటి సైదులు, తిరుమలగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ చాగంటి అనసూర్య, మార్కెట్ కమిటీ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్దన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరమత సహనమే ప్రభుత్వ ధ్యేయం

పరమత సహనమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సామేల్ అన్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకొని సోమవారం నియోజకవర్గ కేంద్రంలోని లక్ష్మీ వెంకటేశ్వర గార్డెన్స్‌లో క్రైస్తవులకు ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసిన ప్రేమవిందు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ అప్పారావు, తహసీల్దార్ దయానంద్, ఎంపీడీఓ శేషకుమార్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, తిరుమలగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ చాగంటి అనసూర్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధకిషన్ రావు, ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పీఏసీఎస్ చైర్మన్లు, ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

మద్దిరాల : మద్దిరాల మండల కేంద్రానికి చెందిన జక్కి కోటేష్, వడ్లాణం శోభారాణిలకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.25వేలు, రూ.42వేలు చొప్పున మంజూరయ్యాయి. సోమవారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే సామేల్ తిరుమలగిరిలోని క్యాంపు కార్యాలయంలో చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్లు అశోక్‌రెడ్డి, చామకూరి శ్రీనివాస్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలని మంత్రికి వినతి



మంత్రి కోమటిరెడ్డిని కలిసిన బాధిత రైతులు

నాగారం : గుర్తుతెలియని వ్యక్తులు మిరప పంటను ధ్వంసం చేసినందున తమకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని నాగారం మండల కేంద్రానికి చెందిన బొబ్బిలి కనకయ్య, పద్మ దంపతులు సోమవారం హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి వేడుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తాము 2 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని మిరప పంట సాగు చేస్తున్నామని తెలిపారు. అయితే ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు మిరప చేనుపై గడ్డి మందును పిచికారీ చేయడంతో పంట పూర్తిగా ఎండిపోయిందని వాపోయారు. మిరప చేను సాగుకు దాదాపు రూ.2.50లక్షలు పెట్టుబడి పెట్టగా పంట చేతికందే సమయంలో నష్టపోయామని వాపోయారు. దీంతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించి పంట నష్టంపై విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని నాగారం తహసీల్దార్, మండల వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జాజుల వీరయ్య, గ్రామశాఖ అధ్యక్షులు మంగదుడ్ల దశరథ, కొమ్ము నరేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం విధానాలకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐకేఎస్ నాయకులు

నూతనకల్ : కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ఖండిస్తూ మండల కేంద్రంలోని సూర్యాపేట–దంతాలపల్లి ప్రధాన రహదారిపై ఏఐకేఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కందాల శంకర్‌రెడ్డి మాట్లాడారు. రైతులను కేంద్ర ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని ఆయన ఆరోపించారు. రైతు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మడ్డి అంజిబాబు, కూసు సైదులు, గజ్జెల కృష్ణారెడ్డి, బత్తుల జనార్దన్, సామ వెంకట్‌రెడ్డి, తొట్ల అచ్చయ్య, గాజుల జానయ్య, మున్నా మహేష్, జటంగి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు కూలీలకు భృతి చెల్లించాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

భానుపురి : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి పరిమితులు లేకుండా మూడెకరాల లోపు భూమి గల వ్యవసాయ కూలీలకు భృతి చెల్లించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పేర్ల నాగయ్య అన్నారు. సోమవారం అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కిషన్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. భూమిలేని వారికి మాత్రమే భృతి ఇస్తామనడం సరికాదని తెలిపారు. వ్యవసాయ కూలీలను విస్మరిస్తే రాబోయే రోజుల్లో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్‌కే సయ్యద్, ఉత్తరాది మోహన్, జాన్ సుందర తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారావుకు నివాళి

భానుపురి : పాటలు, రచనలతో పాణిగ్రాహి సుబ్బారావు ప్రజలను చైతన్యవంతం చేస్తూ సమాజం మార్పు కోసం కృషి చేశారని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి అన్నారు. సోమవారం చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో పాణిగ్రాహి సుబ్బారావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్ కుమార్, వివిధ సంఘాల నాయకులు గంటా నాగయ్య, పి.లక్ష్మయ్య, బొడ్డు శంకర్, కునుకుంట్ల సైదులు, పోలెబోయిన కిరణ్, వి.నర్సింహారావు, దేశోజు మధు, బొల్లె వెంకన్న, పుల్లూరి సింహాద్రి, పిడమర్తి భరత్ తదితరులు పాల్గొన్నారు.

ట్రైసైకిల్ క్యాంపు నిర్వహించాలి

ఆత్మకూర్ (ఎస్) : జిల్లాలో వికలాంగులకు అలింకో కంపెనీ బ్యాటరీ ట్రైసైకిల్, వీల్‌చైర్, వినికిడి యంత్రాలు, చేతి, చంక కర్రలు అందించే క్యాంపును నిర్వహించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి, వికలాంగుల హక్కుల చట్టం –2016 జిల్లా కమిటీ మెంబర్ ఎం డీ.జహీర్‌బాబా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో వినతిపత్రం అందించారు. ఈ క్యాంపు కోసం వేలాది మంది వికలాంగులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. జిల్లాలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో వికలాంగులను కచ్చితంగా నమోదు చేయాలని కోరారు.

విద్యా, వైజ్ఞానిక మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

తుంగతుర్తి : నల్లగొండలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో జరిగే తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆరవ విద్య, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నన్నబోయిన సోంబాబు కోరారు. సోమవారం మండల కేంద్రంలో మహాసభల పోస్టర్లను తుంగతుర్తి ఎంపీడీఓ శేషుకుమార్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మల్లెపాక రవీందర్, మండల ప్రధాన కార్యదర్శి సూర్యప్రకాష్, మిట్టగడుపుల రమేష్, చిత్తలూరి కలమ్మ, ప్రేమయ్య, పాలకుర్తి ఎల్లయ్య, గుండగాని సుధాకర్ పాల్గొన్నారు.

గీత కార్మిక సంఘం సభ్యత్వాల నమోదు



నూతనకల్‌లో సభ్యత్వం అందజేస్తున్న గీత కార్మిక సంఘం నాయకులు

నూతనకల్ : ప్రభుత్వం గీత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కేజీకేఎస్ జిల్లా కార్యదర్శి మడ్డి అంజిబాబుగౌడ్ కోరారు. సోమవారం నూతనకల్ మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో నిర్వహించిన గీత కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, గీత కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. సంవత్సరానికి దాదాపు 60మంది గీత కార్మికులు ప్రమాదాల బారిన పడుతున్నారని, వారిని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బత్తుల జనార్దన్, జెర్రిపోతుల కృష్ణ, నోముల వెంకన్న, బూడిద మల్లయ్య, బీషు రామచంద్రు, జనార్దన్, చామకూరి రమేష్, వెంకన్న, మారయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం



నాగారం : అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు



పెన్‌పహాడ్ : నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నాగారం : రాజ్యసభలో ఇటీవల అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం మండల కేంద్రంలో సూర్యాపేట–జనగామ జాతీయ రహదారిపై సీపీఎం ఆధ్వర్యంలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పులుసు సత్యం మాట్లాడారు. అమిత్‌షా పార్లమెంట్ సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అమిత్‌షా వెంటనే క్షమాపణలు చెప్పాలని అన్నారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ద్వారా మంత్రి పదవిలో కొనసాగుతూ ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు వజ్జ శ్రీనివాస్, మండల కన్వీనర్ దేవరకొండ యాదగిరి, సిగ వెంకన్న, గూడపూడి వెంకటేశ్వర్లు, మొల్కపురి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలి

పెన్‌పహాడ్ : అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గుంజ వెంకటేశ్వర్లు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వీరబోయిన రవి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు లక్కపాక ముత్తయ్య, భోగరాజు శ్రీకాంత్, శ్రీను, సైదులు, వెంకన్న, లక్ష్మణ్, వినోద్ పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

భారత రాజ్యాంగాన్ని మతోన్మాద శక్తుల నుంచి కాపాడుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని లింగాల గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగం అణగారిన వర్గాలకు కల్పించిన రక్షణ చట్టాలను పూర్తిగా మార్చివేసేందుకు మోదీ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నం చేస్తోందన్నారు. మెజార్టీ మతం ముసుగులో ఒకే మతం సిద్ధాంతాన్ని భారత ప్రజలపై రుద్దేందుకు కుట్ర చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గుంజా వెంకటేశ్వర్లు, సీపీఎం సీనియర్ నాయకులు రణపంగ కృష్ణ, అనిల్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టులు, క్రీడా పోటీలతో ప్రతిభను వెలికితీయొచ్చు



తుంగతుర్తి : దాతలు అందజేసిన క్రీడా సామగ్రితో విద్యార్థులు



అర్వపల్లి : విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కిరణ్



నూతనకల్ : విద్యార్థికి ప్రశంసాపత్రం, నగదు అందజేస్తున్న ఉపాధ్యాయులు



ఆత్మకూర్(ఎస్) : విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న దాతలు

నూతనకల్ : విద్యార్థులకు టాలెంట్ టెస్టులు, క్రీడా పోటీలతో వారిలోని ప్రతిభను వెలికితీయవచ్చని హెచ్‌ఎం సోమయ్య అన్నారు. సోమవారం తాళ్లసింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు గణిత విభాగంలో టాలెంట్ టెస్టు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్టులో పాల్గొన్న విద్యార్థి పవన్ సూర్యను ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. బెంగుళూరు సీడీఓటీ కంపెనీలోని ఉద్యోగి చిట్యాల రాంబాబు రూ.2వేలు తన గురువు వెంకన్న ద్వారా అందించారు. విద్యార్థికి పాఠశాల ఉపాధ్యాయులు రూ. 2వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం. వెంకన్న, జి. శ్రీనివాసులు, పీఎస్ చారి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

తుంగతుర్తి : విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని సూర్యాపేట లయన్స్ క్లబ్ రీజనల్ కో–ఆర్డినేటర్ గుడిపూడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. తుంగతుర్తిలో రూ.10 లక్షలతో జిమ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సహదేవ్, లయన్స్ క్లబ్ సభ్యులు లక్ష్మారెడ్డి, మదన్ మోహన్, లక్ష్మీకాంత్‌రెడ్డి, అశోక్, పిచ్చయ్య, పీడీ యాకయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జాజిరెడ్డిగూడెం విద్యార్థులకు అభినందన

అర్వపల్లి : వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా స్థాయిలో బహుమతులు సాధించి, రాష్ట్ర స్థాయికి ఎంపికైన జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు సోమవారం పాఠశాలలో గ్రామానికి చెందిన పోలెబోయిన యాగయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు పోలెబోయిన కిరణ్, మధుకర్‌లు బహుమతులు అందజేశారు. రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లడానికి రూ. 5వేలు ఆర్థికసాయం అందజేశారు. జిల్లా స్థాయి ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు అంజలి, దేవిశ్రీ, మహాలక్ష్మి, రేణుక, చందన, అభిషేక్, గౌతమ్, చందులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఆర్. సైదులు, ఉపాధ్యాయులు, పురుషోత్తం, మల్లిక, వెంకటేశ్వర్లు, రజిని, జ్ఞానేశ్వరి, సైదులు, గ్రామస్తులు లింగమల్లు, గణేష్, హరీష్, వీరేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్టు బహూకరణ

ఆత్మకూర్(ఎస్) : విద్యార్థి దశలో విద్యతోపాటు క్రీడల్లోనూ ప్రావీణ్యత సాధించాలని లయన్స్ క్లబ్ రీజనల్ చైర్‌పర్సన్ గుడిపూడి వెంకటేశ్వరరావు అన్నారు. సుమారు రూ.15వేలతో దాత రేపాల మదన్మోహన్ సమకూర్చిన స్పోర్ట్స్ కిట్టును తుమ్మల పెన్‌పహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కొండపల్లి లక్ష్మారెడ్డి, జోనల్ అధ్యక్షుడు తంగెళ్ల లక్ష్మీకాంతరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు వెంకన్న, అశోక్ రెడ్డి, పిచ్చయ్య పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం



తిరుమలగిరి మార్కెట్‌లో రైతులను సన్మానిస్తున్న మార్కెటింగ్ అధికారులు

తిరుమలగిరి : జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం రైతులను మార్కెట్ కార్యదర్శి శ్రీధర్, సిబ్బంది ఘనంగా సన్మానించారు. అనంతరం శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో రైతు క్లబ్ అధ్యక్షుడు సోమేష్, నరోత్తమ్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, గిరి గౌడ్, నాగాచారి పాల్గొన్నారు.

యాసంగికి ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలి



ఎస్సారెస్పీ కాలువ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నాగారం : యాసంగి సాగుకు ఎస్సారెస్పీ కాలువల ద్వారా నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవా లని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కడియం కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మామిడిపల్లి గ్రామంలో ఉన్న ఎస్సారెస్పీ కాల్వ వద్ద రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. యాసంగి సీజన్ ప్రారంభం కావడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమైనారని అన్నారు. రైతులు వరి పండించుటకు నార్లు పోసి సాగు నీటి కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా ఎస్సారెస్పీ కాలువల గోదావరి జలాలను విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కండె భిక్షం, దేవరకొండ వెంకన్న, పుల్లయ్య, నాగమ్మ, పద్మ, వెంకన్న, మల్లయ్య, శ్రీను పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇళ్ల సర్వే

అర్వపల్లి : అడివెంల, వేల్పుచర్ల, తిమ్మాపురం, కుంచమర్తి, కాసర్లపహాడ్‌తోపాటు వివిధ గ్రామాల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను సోమవారం ఎంపీఓ టి.గోపి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దరఖాస్తుదారుల ఇంటింటికీ వెళ్లి సర్వేచేసి వివరాలను ఇందిరమ్మ యాప్‌లో నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మహాలక్ష్మి, నెహ్రూ నాయక్, కృష్ణవేణి, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

అర్హులైన వారికి ఇళ్లు మంజూరుచేయాలి

ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో భాగంగా అర్హులను ఎంపిక చేసి వారికి ఇళ్లు మంజూరు చేయాలని డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని కోరారు.

గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు

అర్వపల్లి : లోయపల్లిలో కల్వరి కృప ప్రార్థన మందిరం వార్షికోత్సవంతోపాటు గ్రాండ్ క్రిస్మస్ వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ కేలోతు చంద్రశేఖర్, నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ కోశాధికారి కోట యాకోబు, పాస్టర్లు నిర్మల్‌బాబు, సామ్యూల్, దేవేందర్, కృష్ణ, దానియేలు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

దుస్తులు, నిత్యావసరాల పంపిణీ

నూతనకల్ : వృద్ధులను ఆదుకోవడం అభినందనీయమని మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి అన్నారు. క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలోని సీఎస్‌ఏ సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో వికాస వృద్ధుల ఆదరణ వేడుకలు నిర్వహించారు. వృద్ధులకు నిత్యావసర వస్తువులు, నూతన వస్త్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో విజయమేరి పాఠశాల ప్రధానోపాధ్యాయులు సబీనా సిస్టర్, బోనజ్, సాబాది రమణ, ఇరుగు శిరీష తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్ఐ సురేష్

తిరుమలగిరి : మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు, చెడు అలవాట్ల వల్ల కలిగే దుష్ప్రభావాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సురేష్ మాట్లాడారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, గంజాయి, మత్తు మందులను సేవించవద్దని కోరారు. సినిమాలు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం దామర శ్రీనివాస్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మహాసభలను విజయవంతం చేయాలి

చివ్వెంల : టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించే విద్యా, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి రమేష్ అన్నారు. సోమవారం కుడకుడ గ్రామంలో పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమలో ఎంఈఓ రమణ, బోడ దయాకర్, వెంకటనర్సమ్మ, కవిత, సత్తయ్య, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కుంకుమార్చన

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం 8వ రోజు గోదాదేవికి కుంకుమార్చన జరిపారు. అర్చకులు 8వ పాశురాన్ని పఠించారు. అలాగే మహిళలు స్వామి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, భక్తులు గుడిపల్లి సులోచన, యాదమ్మ, కవిత, తదితరులు పాల్గొన్నారు.